## క్లుప్తంగా

### బర్త్ వెయిటింగ్ హాల్‌కు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ రమేష్ నాయుడు

చింతపల్లి: మండలంలో కోరుకొండలో బర్త్ వెయిటింగ్ హాల్ నిర్మాణానికి బలపం సర్పంచ్ కె.రమేష్‌నాయుడు సోమవారం భూమి పూజ చేశారు. రూ.35 లక్షల వ్యయంతో దీనిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మాతా శిశు మరణాల నిర్మూలనకు బర్త్ వెయిటింగ్ హాళ్లకు నాంది పలికి నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.బాబూరావు,పీసా కమిటీ ఉపాధ్యక్షుడు,కార్యదర్శి వీరయ్యదొర,మొండిపల్లి రమేష్,బచ్చలి చిట్టిబాబు,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

రాజవొమ్మంగి : స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలు, పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు.

### టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ


శిబిరాన్ని ప్రారంభిస్తున్న పోలీసులు

సీలేరు: సీఆర్‌పీఎఫ్ జి–42 బెటాలియన్ సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ ద్వారా డీఎస్పీ అనుదీప్ రెడ్డి ఆధ్వర్యంలో టైలరింగ్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో నిరుపేద మహిళలను గుర్తించి వారికి నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా టైలరింగ్ మిషన్లు అందజేయనున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ అనుదీప్ రెడ్డి, ఎస్ఐ రవీంద్రనాథ్ మాట్లాడుతూ పోలీసులు నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

### హౌసింగ్ ఏఈ సూరిబాబుకు సత్కారం


ఏఈ సూరిబాబును సత్కరిస్తున్న నాయకులు

గూడెంకొత్తవీధి: స్థానిక గృహనిర్మాణ శాఖ ఏఈ సూరిబాబును సోమవారం గూడెంకొత్తవీధిలో పలుపార్టీలకు చెందిన నాయకులు అభినందనలు తెలిపి, సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఏఈగా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న సూరిబాబును పలువురు అభినందించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆశా వర్కర్లకు డస్ట్‌బిన్ల పంపిణీ


ఆశా వర్కర్లకు డస్ట్ బిన్లను అందజేస్తున్న సర్పంచ్ రత్నకుమారి

జి.మాడుగుల: మండలంలో బీరం పంచాయతీ కేంద్రంలో సోమవారం సర్పంచ్ మాధుల రత్నకుమారి ఆశావర్కర్లకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డస్ట్‌బిన్‌లను సద్వినియోగం చేయాలని తెలిపారు. గ్రామాల్లో వీధులు, గృహాల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు.



# కూరగాయల సాగు.. లాభాలు బాగు

- విస్తారంగా పండిస్తున్న మాలీ రైతులు
- కౌలుకు భూములు తీసుకుని ఏడాది పొడవునా సాగు
- సంతల్లో విక్రయం ద్వారా ఆదాయం

గూడెంకొత్తవీధి: పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లో పలువురు రైతులు కూరగాయల సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. లాభాలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంటలపై శ్రద్ధ చూపుతున్నారు. ఒడిశా నుంచి చాలా ఏళ్ల కిందట వలస వచ్చిన మాలీ రైతులు అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఏడాది పొడవునా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో అధికంగా జీకే వీధి, జి.మాడుగుల, చింతపల్లి, ముంచంగిపుట్టు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. చింతపల్లి మండలంలో చౌడుపల్లి, పెంటుపాడు గ్రామాల్లో 150 కుటుంబాలకు చెందిన రైతులు 200 ఎకరాల్లో, జీకే వీధి మండలంలో గూడెంకాలనీ, దుప్పుల వాడ, పెదవలస, రింతాడ, ఏబులం, ఆర్వీ నగర్‌లలో 500 కుటుంబాలకు చెందిన రైతులు 1,000 ఎకరాల్లో, జి.మాడుగులలో 100 కుటుంబాల వారు సుమారు 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ముంచంగిపుట్టు మండలంలో పలు గ్రామాల్లో కూరగాయలను పండిస్తున్నారు. వీరికి సొంతంగా ఇక్కడ భూములు లేకపోయినా స్థానికంగా ఉన్న గిరిజన రైతుల వద్ద నుంచి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు.

### సీజన్ల వారీగా..

సీజన్ల వారీగా వీరు పంటలు సాగు చేస్తున్నారు. ఖర్చు తగ్గించుకోడానికి కూలీపై ఆధారపడకుండా సాగు ప్రారంభం నుంచి ముగిసే వరకూ కుటుంబ సభ్యులే పనుల్లో నిమగ్నమవుతారు. పంటను బట్టి ఎకరాకు దుక్కి, పందిర్లు, విత్తుకోవడానికి, ఎరువులు కలిపి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. సుమారు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. వీరి పండించినవే కాకుండా నర్సీపట్నం తదితర మైదాన ప్రాంతాల నుంచి ఉల్లి, వెల్లుల్లి తదితర వాటిని తెచ్చుకుని సంతల్లో విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు.

### అన్ని రకాల కూరగాయలు..

మాలీ రైతులు టమాటా, కాలీఫ్లవర్, క్యాబేజీ, బెండ, దొండ, బంగాళా దుంప, క్యారెట్,బీట్‌రూట్ వంటి వాటితోపాటు ఆనప, బీర, చిక్కుడు, బీన్స్ తదితర రకాల కూరగాయలు, తోటకూర, పాలకూర, చుక్కకూర బచ్చలకూర, గోంగూర వంటివి పండిస్తున్నారు. కొందరు రైతులు గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలకు వీటిని విక్రయిస్తుండగా మరికొందరు వారపు సంతల్లో అమ్ముతున్నారు. ప్రధాన రహదారి పక్కన చిన్న చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకుని వీటిని విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.వేసవిలోనూ నీటి సదుపాయం ఉన్నచోట కాయగూరలను పండిస్తున్నారు.


రింతాడలో కాయగూరల సాగు

### వారపు సంతలే ఆధారం



నేను మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని కూరగాయలు సాగు చేస్తున్నాను. కాలీఫ్లవర్, క్యాబేజీ, టమాటా తదితర రకాల కాయగూరలతో పాటు ఆకుకూరలను కూడా పండిస్తాను. పంటలను వారపు సంతల్లో ఎక్కువగా విక్రయిస్తున్నాం. ఎక్కువ రకాల పంటలు సాగుచేయడం వల్ల కొన్ని పంటలు దెబ్బతిన్నా మిగిలిన పంటల వల్ల నష్టపోకుండా ఉంటున్నాం. ఆదాయం బాగుంది.

–భార్గవ్ , మాలీరైతు రింతాడ

### ఇంటిల్లపాది కష్టపడతాం



మేం 1.5 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నాం. కుటుంబమంతా కష్టపడతాం. సాగుచేసిన పంటలను వారపు సంతల్లో విక్రయిస్తాం. దీని వల్ల అధిక ఆదాయం పొందుతున్నాం.ఎక్కడ వారపుసంత జరిగినా వ్యయప్రయాసలకోర్చి తీసుకువెళ్లి విక్రయించి జీవనోపాధి పొందుతున్నాం.

–కుమారి, మాలీ రైతు రింతాడ

## అభినందనలు


ఎన్నికైనవారికి అభినందనలు తెలుపుతున్న విద్యార్థి నేతలు

పాడేరు రూరల్: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నూతన రాష్ట్ర కార్యవర్గానికి జిల్లా నుంచి ఎన్నికైన ఆరుగురికి విద్యార్థి సంఘం నేతలు సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సూర్యరావు మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నూతన రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుంచి ఆరుగురుకి స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. పాడేరు,అరకులోయ,చింతపల్లి మండలాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థి సంఘం నేతలు శెట్టి ప్రీతి, కృష్ణవేణి,తిరుపల్లి యోగి,మర్రి వెంకటరమణ, బోనంగి శంకర్,గీతలకు స్థానం లభించినట్టు చెప్పారు. అభినందన కార్యక్రమంలో నాయకులు గోపాల పాత్రుడు,కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు


ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాడేరు రూరల్: పాడేరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## నీటి, పారిశుధ్య కమిటీలు బలోపేతం కావాలి


మాట్లాడుతున్న జేఈఈ కల్యాణ్, చిత్రంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: పంచాయతీల్లో గతంలో ఏర్పాటు చేసిన నీటి, పారిశుధ్య కమిటీలు బలోపేతం కావాలని మండల తాగునీటి సరఫరా విభాగం జేఈఈ కల్యాణ్ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం నీటి, పారిశుధ్య కమిటీల నిర్వహణ, వాటి విధులపై సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 141 కమిటీలున్నాయని తెలిపారు. గృహనిర్మాణ శాఖకు సంబంధించి ఆవాస్ ప్లస్ కార్యక్రమంతోపాటు పింఛన్ల పరిశీలన, బాల్యవివాహాలు, పీఆర్–1 యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ సూరిబాబు, ఈవో పీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

## వాహన రికార్డులు లేని 10 మందిపై కేసు


వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: రికార్డులేని 10 మంది వాహన దారులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం మండల కేంద్రం చింతపల్లిలో గల హనుమాన్ జంక్షన్,అంతర్ల, డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేసి, కేసులు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ లైసెన్సు,సీబుక్ లేకపోయినా, హెల్మెట్ ధరించకపోయినా చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి


ఆయాలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. నూతనంగా నియమితులైన 37 మంది అంగన్‌వాడీ ఆయాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలు,గర్భిణులు,బాలింతలకు నాణ్యమైన ఆహార పదార్థాలనుఅందించాలని సూచించారు. సీడీపీవో సంధ్యారాణి మాట్లాడుతూ ఏజెన్సీలో కొత్తగా 37 ఆయా పోస్టులు మంజూరు కాగా, 77 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

## జాబ్ మేళా,ఇంటర్న్‌షిప్ అభ్యర్థులు విధిగా హాజరు కావాలి

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులతో పాటు ఇంటర్న్‌షిప్ విద్యార్థులు మంగళవారం విధిగా హాజరు కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతి తెలిపారు. ఈ నెల తొలి వారంలో జరిగిన జాబ్ మేళాలో ఎంపికై న అభ్యర్థులతో పాటు తృతీయ సంవత్సరం విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం తమ ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో రిపోర్టు చేయాలని కోరారు.

## రేషన్ డిపో మరమ్మతు పనులు ప్రారంభం


డిపో మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ ఆనంద్


డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయతీ కేంద్రంలోని రేషన్ డిపో భవన మర్మమతు పనులను స్థానిక సర్పంచ్ కె.హరి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్ ప్రారంభించారు. ఈ పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న డిపో మరమ్మతులకు నిధులు మంజూరు కావడం హర్షణీయమన్నారు. ఈకార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు తాంగుల పట్నాయిక్, శ్రీనివాస్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి అవార్డు


అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ రామకృష్ణ

రంపచోడవరం: రంపచోడవరం నియోజవర్గం నుంచి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారిగా ఎంపికైన స్థానిక తహసీల్దార్ పి.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా విజయవాడలో అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా అధికారులు,ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ ప్రోత్సాహంతో ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించినట్టు చెప్పారు.

## చలి ఉత్సవాల పేరుతో కోట్ల ఖర్చు తగదు


మాట్లాడుతున్న పాలికి లక్కు

పాడేరు: అరకు చలి ఉత్సవాల పేరుతో కోట్లు ఖర్చు చేయడం తగదని ఆదివాసీ గిరిజన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకుడు పాలికి లక్కు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అరకు ఉత్సవాల పేరుతో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు ప్రభుత్వం నిర్వహించే చలి ఉత్సవాలకు రూ.కోట్లు ఖర్చు చేయడం వల్ల గిరిజనులకు ఒరిగేదేమీ లేదన్నారు. థింసా ఉత్సవాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. టూరిజం ద్వారా వస్తున్న ఆదాయంలో 25శాతం స్థానిక ఆదివాసీల అభివృద్ధికి ఖర్చు చేయాలని,గిరిజన ప్రాంతంలో 40వేల మంది కాఫీ రైతులకు ఇవ్వాల్సిన నిధులు అందజేయాలని, టూరిజం శాఖలో అన్ని ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

# బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- వాడీవేడిగా ముంచంగిపుట్టు మండల సర్వసభ్య సమావేశం
- గ్రామాల్లో నీటి సమస్యలు,హౌసింగ్ అధికారుల అక్రమ వసూళ్లపై సభ్యుల ఆగ్రహం


గ్రామాల్లో నీటి సమస్యలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈను నిలదీస్తున్న సభ్యులు



హౌసింగ్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ముంచంగిపుట్టు: అధికారులు బాధ్యత రహితంగా ఉంటే ఉపేక్షించేది లేదని అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. మొదటిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ మాట్లాడుతూ జేజేఎం కింద మండలంలో రూ.5.78 కోట్ల వ్యయంతో నీటి పథకాలు, జోలాపుట్టు జలాశయం ద్వారా వాటర్ గ్రిడ్ పథకం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దీనికి స్పందించిన సభ్యులు గ్రామాల్లో నీటి పథకాలు సక్రమంగా పనిచేయడం లేదని,వాటర్ గ్రిడ్ పథకం వల్ల ప్రయోజనం లేదని,గతంలో సుజనకోటలో రూ.3కోట్లతో ఏర్పాటు చేసిన పథకం వృథా అయిందని తెలిపారు. హౌసింగ్ అధికారులు గృహ లబ్ధిదారుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారని, కొంతమంది ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై బిల్లుల మంజూరుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు.రోడ్లు వేయాలని,పాఠశాలలకు భవనాలు మంజూరు చేయాలని,అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థలో ఉండడంతో చిన్నారులు,గర్భిణులు,బాలింతలు అవస్థలు పడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు తీరు మార్చుకోవాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాలని, సర్పంచులు,ఎంపీటీసీలకు అభివృద్ధి పనుల వివరాలు తెలియజేయాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని,డబ్బులు వృథా చేసే వాటర్ గ్రిడ్ పథకం రద్దు చేయాలని సూచించారు. పేదలకు అందించే గృహాల్లో అక్రమ వసూలు చేయడం తగదని, హౌసింగ్ అధికారుల తీరు మారాలని తెలిపారు. ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,అటువంటి అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సత్యనారాయణ,భాగ్యవతి, ఎంపీడీవో శ్రీసాయి హర్ష,ఎంఈవో కృష్ణమూర్తి,ఏటిడబ్ల్యూవో స్వర్ణలత,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి(అరకులోయటౌన్): బ్యాంకు ఖాతాకు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానం చేయాలని అనంతగిరి ఎంపీడీవో కుమార్ తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాటాడుతూ గ్రామాల్లో నివాసం ఉండని పౌరులు, ఉద్యోగుల వివరాలతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ కార్డుల వివరాలను మ్యాపింగ్ చేయాలన్నారు. మ్యాపింగ్ చేయకపోతే భవిష్యత్తులో ప్రభుత్వం అందించే పథకాల అమలులో ఆటంకం కలుగుతుందని చెప్పారు. 16 సంవత్సరాల నుంచి 59 ఏళ్ల మధ్య వయసు గల అసంఘటిత కార్మికుల వివరాలు, సూక్ష్మ,చిన్న, మధ్యతరగతి పరిశ్రమల సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది ఎన్‌పీసీఐ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న గృహ లబ్ధిదారుల జియో టాగింగ్‌ను పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను పంచాయతీ కార్యదర్శి ఎంప్లాయిస్ మొబైల్ యాప్ ద్వారా తప్పని సరిగా నమోదు చేయాలని ఎంపీడీవో కుమార్ సూచించారు.

## పీసా చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వికాస్ బాలరాజు

అరకులోయటౌన్: దోపిడీ దారులను అడ్డుకునే ఏకైక చట్టం పీసా చట్టమని దానిపై పీసా సభ్యులు అవగాహన కలిగి ఉండాలని నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు అన్నారు. సోమవారం నేచర్ క్యాంపస్‌లో పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు,సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల పరిరక్షణకు ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టి రోషిణి, సర్పంచ్‌లు రమేష్, బి.బి. బొజ్జ, లొతేరు, మాడగడ, ఇరగాయి, గన్నెల, బొండాం, మాదల, సుంకరమెట్ట, బస్కీ పంచాయతీల్లోని పీసా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ‘బైపాస్ రోడ్డు’ సమస్యలపై వినతి


సబ్ కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న పీసా కమిటీ సభ్యులు

పాడేరు రూరల్: పాడేరు మీదుగా జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టబోతున్న బైపాస్ రోడ్డు కారణంగా ఏర్పడుతున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పీసా కమిటీ సభ్యులు సల్ల రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, కిల్లు రాధాకృష్ణనాయుడు, సింహాచలంనాయుడు సోమవారం సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బైపాస్ రోడ్డు నిర్మాణం కారణంగా రైతులు పలు సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఇప్పటివరకు రైతులకు పరిహారం చెల్లించలేదని చెప్పారు. సమస్యలపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

## ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో శ్రీమోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ ఎలక్ట్రీషియన్ డేని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ డీఈ బాల మురళి మాట్లాడుతూ విద్యుత్ పనులు చేస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి రామారావు,అధ్యక్షుడు మహమ్మద్ హనీఫ్, ప్రధాన కార్యదర్శి దామోదర్, కార్యదర్శి స్వామి నాయుడు, ముఖ్య సలహాదారుడు సింహాచలం నాయుడు, ముంచంగిపుట్టు, పెదబయలు,జి.మాడుగుల,చింతపల్లి మండలాల ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## పారా లీగల్ వలంటీర్ల నియమాకానికి దరఖాస్తులు

నర్సీపట్నం: పారాలీగల్ వలంటీర్ల నియమానికి ఔత్సాహకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షీయాజ్ ఖాన్ తెలిపారు. ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ జెరాక్స్, విద్యార్హత, పాస్ ఫొటోను మండల లీగల్ సర్వీస్ కమిటీకి అందజేయాలన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి, వివిధ సేవా సంస్థల్లో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతం కానీ, పారితోషికం ఉండదని, సేవా దృక్పథంతో పని చేయాలన్నారు.